ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 19 మార్చి 2024

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

19, 20, 21, 22 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కటేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 20 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.





శంభునిపేట ప్రభుత్వ పాఠశాల సెంటర్‌లో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

'పది' పరీక్షలు షురూ

- మొదటి రోజు 99.8శాతం హాజరు
- శంభునిపేట సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే కేంద్రాల వద్ద విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల కోలాహలం నెలకొంది. తల్లిదండ్రులు జాగ్రత్తలు చెబుతూ తమ పిల్లల్ని సెంటర్‌లోకి పంపారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు జిల్లాలో 99.8శాతం హాజరయ్యారు. 9,448 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9,432 మంది హాజరుకాగా 16 మంది గైర్హాజరయ్యారు. 8మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు హాజరయ్యారు.

కలెక్టర్ పి.ప్రావీణ్య శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలోని కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వెంట ఉన్న డీఈవో వాసంతిని ఆదేశించారు. కాశిబుగ్గ నరేంద్రనగర్‌లోని కేంద్రానికి ప్రమాదంలో కాలు విరిగిన బాలున్ని తన తల్లి పరీక్షకు తీసుకువచ్చారు. మట్టెవాడలో మరో పరీక్ష కేంద్రానికి వచ్చి హైరానా పడుతున్న బాలికను మట్టెవాడ పోలీసులు బాలికను ఆమె రాయాల్సిన కేంద్రానికి చేర్చారు.



కాశిబుగ్గ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న తల్లితో వెళ్తున్న గాయపడిన బాలుడు



ఎవరికో అభయ 'హస్తం'?

- కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ టెన్షన్
- 50మందికి పైగా ఆశావహుల ఎదురుచూపు
- నేడు, రేపు ఢిల్లీలో ఏఐసీసీ, సీఈసీ సమావేశాలు
- పొత్తులో సీటు తమదేనన్న ఆశల్లో కమ్యూనిస్టులు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో పార్టీలన్నీ ప్రజాక్షేత్రంలోకి దిగుతున్నాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదను పెడుతున్నాయి. కానీ వరంగల్ పార్లమెంట్ స్థానంలో మాత్రం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవటంతో ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా కాంగ్రెస్ టికెట్‌పై 50మందికి పైగా ఆశలు పెట్టుకుని ఢిల్లీ, హైదరాబాద్‌లలోని ముఖ్యనాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో జరిగే ఏఐసీసీ, సీఈసీ సమావేశాల్లో మిత్రపక్షాలతో పొత్తులు, మిగతా స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తారన్న వార్తల నేపథ్యంలో వరంగల్‌లో ఎవరికి పార్టీ నుంచి అభయ 'హస్తం' దక్కుతుందోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

వరంగల్ టికెట్‌పై పలువురి నజర్

వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. గత నెలలో ఆశావాహుల నుంచి అధిష్ఠానం దరఖాస్తులను స్వీకరించగా 42మంది తమకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆ తరువాత మరో పది మంది ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే ఏఐసీసీ బలమైన అభ్యర్థిని బరిలో దించాలని ప్రయత్నిస్తోంది. దీంతో ఇప్పటికే మూడు పర్యాయాలు వివిధ సర్వే ఏజెన్సీలతో సర్వేలు కూడా చేయించింది. అలాగే చాలామంది ఆశావహులు హైదరాబాద్, ఢిల్లీలో మకాం వేసి పీసీసీ, ఏఐసీసీ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్యతో పాటు స్టేషన్‌ఘనపూర్ నియోజవర్గ

మిగతా 8వ పేజీలో..



ఎల్‌ఆర్‌ఎస్‌పై అయోమయం!

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య	
జీడబ్ల్యూఎంసీ :	21,623
జనగామ :	6,300
మహ-బాద్ :	7,546
తొర్రూరు :	3,200
డోర్నకల్ :	3,600
మరిపెడ :	4,234
పరకాల :	5,200
నర్సంపేట	5,462
వర్ధన్నపేట :	1,200
భూపాలపల్లి :	7,234

- ఈనెలాఖరులోపు పరిష్కారం సాధ్యమేనా?
- ఓ వైపు సిబ్బంది కొరత.. మరో వైపు ఎన్నికల హడావిడి
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 65వేలకుపైగా దరఖాస్తులు
- ఇప్పటికే రెండేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపు

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థలాల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం తెరపైకి లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)లో వచ్చిన దరఖాస్తులన్నిటిని ఈనెల 31 లోపు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమైనా.. మున్సిపల్ అధికారులు మాత్రం ఆయోమయంలో పడ్డారు. ఓ వైపు శాఖల్లో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా.. ఈ లోపే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రబద్ధీకరణ ప్రక్రియ పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధం వారి నుంచి వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియలో నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది, మునిసిపల్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు చైన్‌మెన్లు ఎంతో కీలకం. అయితే వరంగల్ మహానగర పాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట మున్సిపాలిటీల్లో మాత్రమే కొంత మేరకు ఈ సిబ్బంది ఉన్నా.. వీరికి ఇతర మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటే అయిదారు నెలలు పడుతుందని అంచనా కాగా.. ప్రస్తుతం తగిన సంఖ్యలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చిన నేపథ్యంలో చాలామంది అధికారులు, సిబ్బంది ఆ విధుల్లో బిజీగా మారడంతో ఈనెలాఖరు లోపు క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలపై మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ అమలులో ఎట్టకేలకు కదలిక వచ్చినా పలు కారణా లతో ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితులు కనిపిం చడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ నగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలో 65వేలకుపైగా దరఖాస్తులు పరిష్కారానికి ఎదురుచూస్తున్నాయి.

పథకం అమల్లో కదలిక..

2020లో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల భూ క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండడంతో ఇక్కడి స్థలాల ధరలు భారీగా పెరిగాయి. పట్టణ శివార్లలో జోరుగా వెంచర్లు వెలియడంతో కొనుగోలుదారులు వాటిలో ప్లాట్లు తీసుకున్నారు. చాలా వెంచర్లకు అనుమతి లేపోవడంతో పురపాలక సంఘాల అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకురాగా తాజాగా ఈ పథకం అమలులో కదలిక వచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్ మహానగర పాలక సంస్థతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల్లో మొత్తం 65,599 ధరఖాస్తులు రాగా.. అప్పట్లోనే వీటి ద్వారా మునిసిపాలిటీలకు రూ.65.59కోట్ల ఆదాయం వచ్చింది. ఇక దరఖాస్తు సమయంలో ఒక్కో ప్లాట్‌కు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చెల్లించారు. వివిధ కారణాలతో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. గత నెల 22న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దాంతో పురపాలికలకు ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడగా.. గత నెల 26న ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసింది. దేవాదాయ, వక్ఫ్ బోర్డు, ప్రభుత్వ, కోర్టు పరిధిలో ఉన్న భూములను మినహాయించి ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది

పరిశీలనతో మరింత ఆదాయం..

వరంగల్ నగర పాలక సంస్థతో పాటు జనగామ, మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మున్సిపాలిటీల్లో నేరుగా ఈ దరఖాస్తులను పరిశీలించవచ్చు. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే పురపాలికకు ప్రాంతాన్ని బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో స్థలానికి ఉన్న డిమాండ్‌ను బట్టి ఈ విలువ ఇంకా పెరిగి మునిసిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరుతుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. చాలా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్దీకరణతో రూ. వందల కోట్లలో ఆదాయం సమకూరనుంది. పట్టణాల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనల మేరకు 10 శాతం స్థలాన్ని ప్రజోపయోగం కోసం పురపాలికలకు అప్పగించాలి. ఇది చాలా చోట్ల అమలు కాలేదు. దీనికి తోడు నిర్దేశించి వెడల్పు న రోడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో వెంచర్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

మార్గదర్శకాలు లేక...

సెల్‌ఫోన్ యాప్, పురపాలక శాఖ వెబ్ సైట్ (ఎల్‌ఆర్‌ఎస్-2020) ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఎలా పరిశీలించాలి ? ఎన్ని విడతల్లో ప్రక్రియ చేపట్టాలనే అంశంపై యంత్రాంగంలో స్పష్టత లేక ఇంతకాలం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అడపాదడపా ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగా లేకపోవడంతో మునిసిపాలిటీల్లో ఇంత కాలం ముందుకు సాగలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో అధికారులు ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కసరత్తు ముమ్మరం చేశారు.

సోమవారం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 33.0°C | కనిష్టం : 22.0°C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా : 6.32 గం..
సహార్ : బుధవారం ఉ : 4.59 గం..

ఆయుర్వేద బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా పద్మావతి



గిర్మాజిపేట, మార్చి18 : వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.పద్మావతి తిరిగి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి (ఎర్రగడ్డ- హైదరబాద్) ముఖ్య వైద్యాధికారిగా పనిచేస్తున్న పద్మావతిని సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ ఎం.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహ నాచారి నుంచి డాక్టర్ పద్మావతి సోమవారం సూపరిం డెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఇదిలాఉండగా ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పద్మావతిని ప్రభుత్వం 2022 డిసెంబరు 24న ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి హైదరాబాద్ ముఖ్య వైద్యాధికారిగా నియమించిన విషయం విదితమే. అప్పటి నుంచి జగన్మోహనాచారి ఇన్‌చార్జి సూపరింటెం డెంట్‌గా పనిచేస్తున్నారు. 15 నెలల అనంతరం తిరిగి పద్మావతిని నియమించారు. దీంతో వైద్యులు, సిబ్బంది పద్మావతిని అభినందించారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి: కలెక్టర్ ప్రావీణ్య
- హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లతో సమన్వయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో హనుమకొండ, జనగామ, భూపాలపల్లి కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌కుమార్, ఎన్నికల నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కోరారు. అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సమీకరించిన బీఎల్ఓ వివరాలు, ఆగ్జిటరీ పోలింగ్ కేంద్రాలు, క్లిష్టమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంట్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం, ఎంసీఎంసీ, స్ట్రాంగ్, కౌంటింగ్ సెంటర్ల సిబ్బందికి శిక్షణ, నాలుగు జిల్లాల ధరల పట్టికలో రేట్లు, నోడల్ అధికారుల నియామకం, పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ, ఓటింగ్ శాతం పెంపుపై కూలంకషంగా చర్చించారు. స్పెషల్ పోలింగ్ కేంద్రాలు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, ఓటర్ అవేర్‌నెస్ ఫోరం ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఎన్నికల విదుల నిర్వహణ, సామగ్రి పంపిణీ, సెక్టార్ రూట్‌మ్యాప్‌లు తదితర అంశాలపై సమీక్షించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 1899 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 419 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజవుగా పోలింగ్ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రోజువారి నివేదికలను ఎలాంటి తప్పులు దొర్లకుండా సకాలంలో పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

సమష్టిగా పని చేయాలి: సీపీ

సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. గత అసెంబ్లీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. వచ్చే 90రోజులు అధికారులందరూ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటారని నిబద్దతతో వ్యవహరిస్తూ, చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సమన్వయంతో పని చేయడంతో విజయవంతంగా పూర్తి చేశామని అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఏఆర్ఓలు, ఏసీపీలు సమన్వయంతో నివేదికలు అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు.

భూపాలపల్లి, జనగామ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌కై అధికారులకు విధులు కేటాయించామని, సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాల్సి ఉందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డీఎస్.వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, దత్తు, రాధికగుప్తా, వైవి.గణేష్, ఉప ఎన్నికల అధికారులు పీయూష్ కుమార్, సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు, డీసీపీలు ఎం.ఎ.బారి, రవీందర్, సీతారాం, ఏసీపీలు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



శాయంపేట, మార్చి 18: ఇంటర్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శాయంపేట మండలంలో జరిగింది. ఎస్ఐ ప్రమోద్ కుమార్ కథనం ప్రకారం.. రాజుపల్లి గ్రామానికి చెందిన ఆవుల దిలీప్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ టెలిగ్రామ్ యాప్‌కు సంబంధించిన ఫేక్ ట్రెండింగ్‌లో రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో విషయం తన తండ్రికి తెలుస్తుందనే భయంతో ఈనెల 3న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మడికొండలో కేంద్ర పోలీసు బలగాల కవాతు



మడికొండలో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య

మడికొండ, మార్చి 18: త్వరలో లోక్‌సభకు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి సోమవారం మడికొండలో స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మెట్టుగుట్ట ప్రధాన ద్వారం వద్ద నుంచి గ్రామం ధర్మసాగర్ రోడ్డు చివర వరకు, అలాగే గ్రామంలోని ప్రధాన వీధులలో పోలీసు బలగాలు కవాతు చేశారు. ఈసందర్భంగా స్థానిక సీఐ ప్రతాప్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించనట్లయితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై రమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు జంపయ్య, మోహన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకట్, రామ్మూర్తి, అశోక్, రాజ్‌కుమార్, రాజు, సతీష్, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.

నమ్మించి వంచించాడు...

పోలీసులకు యువతి ఫిర్యాదు - కేసు నమోదు

హనుమకొండ టౌన్, మార్చి 18 : వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకొని పెళ్లి విషయం ప్రస్తావించగానే నాకు సంబంధం లేదంటూ యువకుడు తప్పించుకొని తిరుగుతున్నాడని ఓ యువతి సోమ వారం రాత్రి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోక్కలగడ్డ ప్రాంతానికి చెందిన యువకుడు వివాహం చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి శారీకరంగా అనుభవించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగానికి ఫ్రీపేర వుతు న్నాని 5 లక్షలను డిజిటల్ పేమెంట్ ద్వారా తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి తల్లి పెద్దమనుషుల ద్వారా వివాహం గురించి యువకుడి అడగగా పెళ్లికి ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయిం చా రు. పోలీసుల సమక్షంలో పెళ్లికి అంగీకరించి ఈ నెల 16న యువతీతో నిశ్చితార్థం చేసుకున్నాడు. మరుసటి రోజు నుంచి పెళ్లి ఇష్టం లేదు, పెళ్లి చేసుకోనని బెదిరిస్తుండడంతో యువతి ఫిర్యాదు మేరకు యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ.. ఆభరణాలు పట్టివేత



పట్టుబడిన ఆభరణాలను చూపిస్తున్నఎస్సై

ఐనవోలు, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఐనవోలు పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పున్నేలు క్రాస్‌రోడ్డు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయరహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. జనగాం జిల్లా జఫర్‌గడ్‌కు చెందిన గోల్డ్ స్మిత్ కందగట్ల శివప్రసాద్ రూ. 11.13 లక్షల విలువచేసే బంగారం, వెండి అభరణాలను తన కారులో తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. పత్రాలు లేని కారణంగా ఆభరణాలను స్వాధీనపరుచుకొని విచారణ కోసం ఇన్‌కాం టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్ క్రైం, మార్చి18 : వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ కాలనీలో మూడు బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.15 వేల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం లేబర్ కాలనీలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పి.రమేశ్, సంపత్, విద్యాసాగర్ ఇళ్లపై దాడి చేశారు. వారి నుంచి లిక్కర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధృవీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రవీందర్(ఫైల్)

ఆత్మకూరు, మార్చి 18: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన రవీందర్ (50) తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగా సోమవారం కూడా పనికి వెళ్లి ఇంటికి వచ్చిన అనంతరం ఇంటిలోని కరెంట్ బోర్డువద్ద ఉన్న వైర్లు రవీందర్‌కు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీ, వివాహాలు అయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఇంటర్‌సిటీ

గార్ల, మార్చి 18 : సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లవల్సిన ఇంటర్ సిటీఎక్స్‌ప్రెస్‌రైలు సాంకేతిక లోపంతో గార్లలో 20 నిమిషాలు, డోర్నకల్‌లో 30 నిమిషాల పాటు అధికారులు నిలిపివేశారు. రైలు గార్ల సమీపంలోని పాకాలవంతెన వద్ద రైల్వే మరమ్మతుల పనులను నిర్వహిస్తున్న సిబ్బంది బండి వచ్చే సమయంలో ఉద్యోగులు ట్రాక్‌కు అమర్చిన జాకివదిలి పక్కకు తప్పుకున్నారు. దీంతో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు పెద్దప్రమాదం తప్పింది. ఇంజన్ ముందు భాగం పూర్తిగా దెబ్బతినండంతో బండిని సుమారు గంట పాటు నిలిపి వేశారు అనంతరం మరమ్మతులు చేపట్టి ముందుకు సాగించారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి స్థానిక యూనిట్ నెంబర్ 8 సంబంధించిన గ్యాంగ్ మోకర్‌దామ్ తమ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవరించారని ప్రాథమిక దర్యాప్తులో తేల్చి సదరు ఉద్యోగిని మహారాష్ట్ర బీదర్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

దంతాలపల్లి (మహబూబాబాద్ జిల్లా), మార్చి 18 : మండలంలోని రామానుజపురానికి చెందిన బయ్య ఉప్పలయ్య (55) తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. బయ్య ఉప్పలయ్యకు భార్యతో పాటు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 15న ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఈ క్రమంలో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా, సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరీక్షణ

'ఇజ్జత్' పాస్‌ల పునరుద్ధరణ కోసం ఎదురుచూపులు

- రాయితీ రైల్వేపాస్‌లు లేక ఇబ్బందులు
- రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న పేదలు దినసరి కూలీలు, చిరువ్యాపారులు
- నిబంధనలు సవరించి, తిరిగి అమలు చేయాలని డిమాండ్

కేసముద్రం, మార్చి 18 : కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని రైల్వేశాఖ అమలు చేసిన 'ఇజ్జత్' పాస్‌ల కోసం నిరుపేద వర్గాలు ఎదురుచూస్తున్నాయి. రాయితీ పాస్‌లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ అల్పాదాయవర్గాలకు చెందిన దినసరి కూలీ పనులు చేసుకునేవారు, చిరువ్యాపారులు కేసముద్రం, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, డోర్నకల్, భద్రాచలం ప్రాంతాలకు రైళ్లలో అప్‌అండ్‌డౌన్ చేస్తున్నారు. అల్పాదాయ వర్గాలను దృష్టిలో ఉంచుకొని, వారికి ఉపయోగపడేలా.. రూ.25లకే నెలరోజుల రైల్వే రాయితీ పాస్‌లను 'ఇజ్జత్' పేరుతో 2009లో అప్పటి కేంద్రప్రభుత్వం రైల్వేశాఖలో ఈ పథకాన్ని ప్రారంభించింది. నెలకు రూ.1500 అంతకంటే తక్కువ ఆదాయం ఉన్నవారు రూ.25లు చెల్లిస్తే, వంద కిలోమీటర్ల మేర నెల రోజులపాటు రైళ్లలో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించారు. ఈ పాస్‌లను పొందేందుకు ఆదాయ ధ్రువీకరణ బాధ్యతలను పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలకు ఇచ్చారు. ప్రజాప్రతినిధి ఇచ్చే ఆదాయ ధ్రువీకరణ లేఖను తీసుకువచ్చి రైల్వేస్టేషన్‌లో రూ.25లు చెల్లించి నెలరోజుల ప్రయాణం కల్పించే రాయితీ ఇజ్జత్ పాస్‌ను తీసుకునే అవకాశం ఉంటుంది. మూడు నెలలకొకసారి ఆదాయ ధృవీకరణ లేఖను తీసుకువచ్చి ఇజ్జత్ పాస్‌లను రెన్యువల్ చేసుకునే వారు.

అయితే ప్రజాప్రతినిధుల నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇష్టారీతిన తీసుకురావడంతో అధిక ఆదాయం ఉన్నవారు సైతం ఇజ్జత్ పాస్‌లను పొందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ రైలు సీజన్ టికెట్ల సంఖ్య తగ్గుతూ ఇజ్జత్ పాస్‌ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో రైల్వేశాఖ ఆ పాస్‌ల నిబంధనలను సవరించింది. 2013 అక్టోబర్ నెలలో ప్రజాప్రతినిధుల లేఖతో పాటు తహసీల్దార్ జారీచేసే ఆదాయ ధ్రువీకరణ పత్రం సైతం తప్పనిసరిగా జతచేయాలనే నిబంధన విధించింది. ఈ నిబంధనల ప్రకారం నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకురావాల్సి ఉంటుంది. ఆదాయ ప్రమాణాలు పెరిగిన పరిస్థితుల్లో రూ.18 వేలలోపు ఆదాయ ధ్రువీకరణ ఇచ్చే నిబంధనలు రెవెన్యూశాఖలో లేవు. దీంతో ఇజ్జత్ పాస్‌ల జారీ క్రమంగా నిలిచిపోయింది. ఆ తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయి, బీజేపీ ప్రభుత్వం రావడంతో ఈ పథకాన్ని ప్రారంభించే విషయంలో గత పదేళ్లలో ఎలాంటి ప్రకటన చేయలేదు.

నిబంధనలు సవరిస్తేనే అమలు సాధ్యం..

'ఇజ్జత్' పాస్ జారీలో ఉన్న నిబంధనలు మారుతున్న ఆర్థిక పరిస్థితులకనుగునంగా సవరిస్తే అమలు సాధ్యమని తెలుస్తోంది. ఈ పాస్‌ల జారీకి రోజుకు రూ.50ల ఆదాయం ఉండే వారే అర్హులు. 15 ఏళ్లనాటి ఆదాయ ప్రమాణాలను ప్రస్తుత కాలానికి అనుగునంగా ఈ నిబంధనలు మార్చాల్సిన అవసరం ఉంది. కూరగాయలు విక్రయించే వారు, కూలీ పనులకు వెళ్లే వారికి కనీసం రోజుకు రూ.200 నుంచి రూ.500 వరకు ఆదా యం వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితిని నెలకు రూ.1500లను సవరించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని అల్పాదాయవర్గాలు కోరుతున్నాయి. ఇలా చేయడంవల్ల రూ.72 వేల నుంచి రూ.1.80 లక్షల ఆదాయం వరకు తహసీల్దార్ ద్వారా ఆదాయ ధ్రువీకరణపత్రం తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ఈ ధృవీకరణపత్రాల ఆధారంగా మళ్లీ ఇజ్జత్ పాస్‌లను రూ.25లకే జారీ చేస్తే తమకు రైలు ప్రయాణ ఖర్చులు మిగులుతాయని అప్‌డౌన్‌చేసే దినసరి కూలీలు, చిరువ్యాపారులు చెబుతున్నారు.



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో అప్‌అండ్‌డౌన్ చేస్తున్న దినసరి కూలీలు, అల్పాదాయ వర్గాలు (ఫైల్)

సుమారు 500 మంది..

మహబూబాబాద్ జిల్లాలోని ఇంటికన్నె, కేసముద్రం, తాళ్లపూసపల్లి, మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల నుంచి నిత్యం సుమారు 500 మంది అప్‌అండ్‌డౌన్ చేసే కార్మికులు, అల్పాదాయ వర్గాలకు చెందిన వారున్నారు. వీరిలో కేసముద్రం నుంచి ఉదయం కాకతీయ, సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్లకు వందమంది వరకు భవన నిర్మాణ కార్మికులు, అల్పాదాయవర్గాలుండగా, వివిధ రకాల చిరువ్యాపారులు 100 నుంచి 150 మంది వరకు వెళుతున్నారు. మహబూబాబాద్, గుండ్రాతిమడుగు, గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్ల నుంచి ఖమ్మంకు 200లకుపైగా వరకు కూలీలు, చిరువ్యాపారులు ఉదయం పుష్‌పుల్ రైలుకు వెళుతున్నారు. వీరంతా ఇజ్జత్ పాస్‌లు పొందేందుకు అర్హులైన అల్పాదాయవర్గాలకు చెందినవారు కావడం గమనార్హం.

రాయితీ పాస్‌లను ఇవ్వాలి

ఆంగోత్ బాల, కాంగ్రెస్ నాయకుడు, కేసముద్రం స్టేషన్



దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలకు ఎంతో ఉపయోగపడే రాయితీ పాస్‌లను ఇవ్వాలి. నిత్యం అధిక చార్జీలతో అప్‌అండ్‌డౌన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇజ్జత్ పాస్‌లు ఎంతో ఉపయోగపడ్డాయి. మళ్లీ రాయితీ పాస్‌లను అందించాలి.

అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న పేదలు

అడప రాజు, దర్జీ, కేసముద్రం స్టేషన్



ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు, దినసరి కూలీలు, అల్పాదాయవర్గాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. ఆదాయం పెరిగినప్పటికీ ఖర్చులు కూడా అధికమయ్యాయి. ఇప్పటి పరిస్థితులకనుగునంగా ఇజ్జత్ పాస్‌ల నిబంధనలను మార్పు చేసి మళ్లీ పేదలకు రూ.25ల రాయితీ పాస్‌లను అందివ్వాలి.

శాస్త్రవేత్తల పరిశోధనలు తోడ్పాటును అందించాలి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు రైతుల సంక్షేమానికి తోడ్పాటు అందించే విధంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం ములుగురోడ్‌లోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడారు. పంటల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలని కోరారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక ఒరవడులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రైతుల సంక్షేమానికి పరిశోధన, విస్తరణ రంగాల్లో శాస్త్రవేత్తలు చేసే ప్రతీ కార్య క్రమానికి తన తోడ్పా టు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం పరిశోధన స్థానం ఏడీ డాక్టర్ రావుల ఉమా రెడ్డి 2022-23 సంవ త్సరంలో వరంగల్ ప్రాం తీయ పరిశోధన స్థానం లో జరిగిన పరిశోధన ఫలితాలను వివ రించారు. రాబోయే సీజన్లలో విడుదల చేయ బోయే సరికొత్త వంగడాల గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశో ధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామ్‌రెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, రాణాప్రతాప్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. మాలతి, టి. సుజాత, వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యసాయాధికారులు ఉషాదయాల్, రవీందర్‌సింగ్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. బలరామ్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, వివిధ జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి

లేదంటే యథావిధిగా సమ్మె

వరంగల్ మెడికల్, మార్చి 18 : మూడు నెలల వేతనాల కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీస్‌పై యూనియన్ ప్రతినిధులతో ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ సోమవారం చర్చలు జరిపారు. 20వ తేదీ వరకు జీతాలు చెల్లించాలని డైరెక్టర్ హామీ ఇచ్చారని జీతాలు చెల్లిస్తే సంతోషం. లేకపోతే యథావిధిగా సమ్మె కొనసాగుతుందని ఏఐటీ యూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా, ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న దాదాపు 17వేల మంది ఉద్యోగులకు మూడు నెలలుగా చెల్లించకుండా పెం డింగ్ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఈ నెల 22 నుం చి నిరవధిక సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ వేతనాలు చె ల్లించే విషయంలో కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఈ పోరాటానికి ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, రెండవ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాం జనేయులు, రెండవ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్యదర్శి బి.శ్యామల, కోశాధికారి పద్మ, జ్యోతి, రాజేశ్వరెడ్డి, బాపుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ

స్టోన్ క్రషర్స్ యజమానుల సమ్మెబాట

- ఉపాధి కోల్పోతున్న వందల మంది కూలీలు
- సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ
- ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేయాలని యజమానుల డిమాండ్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 18 : మైనింగ్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా తెలంగాణ స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టోన్ క్రషర్స్ యజమానులు ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. 25 సంవత్సరాలుగా క్రషర్స్ లీజుకు తీసుకుని నడుపుకుంటున్న మాపై అక్రమంగా పెనాల్టీలు వేస్తున్నారని యజమానులు అంటున్నారు. మేము ప్రతీ సంవత్సరం రాయల్టీ ఫీజు హెక్టార్‌కు రూ.లక్ష ప్రభుత్వానికి కడుతున్నామని, 80 శాతం కంకరను ప్రభుత్వ పనులకే సరఫరా చేస్తున్నామని, 80 శాతానికి కాంట్రాక్టర్ బిల్లు నుంచి సీనరేజి ఛార్జెస్ కట్ చేసి మైనింగ్ శాఖకు జమ చేస్తున్నామని యజయానులు వాపోతున్నారు.


క్రషర్‌లో నిలిచిన పనులు


నిలిచిన వాహనాలు

సమ్మెకు దారి తీసిన రాయల్టీ ఫీజు రగడ

రాయల్టీ(సీనరేజి) ఫీజు అనేది కాంట్రాక్టర్ దగ్గర గానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర గానీ ఎవరో ఒకరి దగ్గర మాత్రమే ప్రభుత్వం వసూలు చేయాలి. కానీ ప్రభుత్వ పనులకు సంబంధించిన సీనరేజి చార్జెస్ మైనింగ్ శాఖకు క్రషర్ యజమానులు చెల్లించాలి దాంతో మాకు సంబంధం లేదు అని అంటున్నారని యజమానులు సమ్మెకు దిగారు. అలాగే 30 సంవత్సరాల నుంచి ఉన్న లీజులను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా సర్వే చేసి ఇప్పుడున్న రేటు ప్రకారం ఇష్టారాజ్యంగా పెనాల్టీ వేసినట్లయితే గతంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఏం చేసిందనేది క్రషర్ యజమానుల వాదన. ఇప్పుడు ఆన్‌లైన్ సర్వే చేసి కోట్ల రూపాయలు పెనాల్టీ వేస్తున్నారని, ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తయారు చేస్తే ప్రభుత్వం ఎలా చెప్తే అలా నడుచుకుంటామని అంటున్నారు.

ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి..

పేరాల మధుసూదన్ రావు, కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం సరైన మైనింగ్ పాలసీ తీసుకురావాలి. రాయల్టీ ఫీజు కాంట్రాక్టర్ దగ్గర కానీ లేదా క్రషర్ యజమానుల దగ్గర ఎవరో ఒకరి దగ్గర మాత్రమే తీసుకోవాలి. డిజిటల్ సర్వే చేసి రూ.కోట్లలో పెనాల్టీ విధించడం సరికాదు. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తాం.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా క్రషర్స్ నడుపుకోవాలి

సాంబశివరావు, మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టోన్ క్రషర్స్ యజమానులు క్రషర్స్‌ను నడుపుకోవాలి. ప్రభుత్వ, మైనింగ్ శాఖ నిబంధనల మేరకు నడుచుకోవాలి. క్రషర్స్ యజమానుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.

వెండి ఆభరణాలకూ హాల్ మార్క్ వేయాలి

బీఐఎస్ డీడీజీకు వినియోగదారుల మండలి విజ్ఞప్తి

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు చెన్నైలోని సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యుఎస్‌పీ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్, ఉపాధ్యక్షుడు మొగలిచెర్ల సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పిడతల రమేష్‌రెడ్డి, చెన్నై నగర అధ్యక్షుడు ఎకె.ప్రకాశ్‌లు చెన్నైలో యాదవ్‌తో సమావేశం అయ్యారు. వెండి ఆభరణాలలో 50 శాతం వరకు కల్తీ జరుగుతోందని, వెండిని ఎక్కువ శాతం కొనుగోలు చేసేది పేద, మధ్య తరగతి ప్రజలేనని వారు తెలిపారు. సాంప్రదాయంగా వెండిని ఎక్కువగా ధరించేది గిరిజనులేనని, దీంతో వెండిలో కల్తీ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేదవారు, గిరిజనులేనన్నారు. అందు వల్ల వెండి ఆభరణాలకు కూడా హాల్ మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 41, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 హాల్ మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయనీ వీటి సంఖ్యను పెంచాలని కూడా వారు కోరారు. వినితి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు బిఎస్‌ఐ డీడీఏ యాదవ్ సానకూలంగా స్పందించారు. తెలంగాణతో పాటు ఆరు రాష్ట్రాల్లో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


వినతి పత్రం సమర్పిస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

రేపటి నుంచి కెమిస్ట్రీ మూల్యాంకనం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : ఇంటర్మీడియేట్ జవాబు పత్రాల మూల్యాంకనంలో భాగంగా ఈ నెల 20 నుంచి రసాయన శాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని క్యాంపు అధికారి ఎ. గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీతో పాటు ఫిజిక్స్ ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మూల్యాంకన విధుల్లో పాల్గొనాల్సిన అధ్యాపకులు 20న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ స్పాట్ క్యాంప్‌లో రిపోర్టు చేయాలని ఆయన కోరారు.

నేడు రైతులకు వీసీలో సలహాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 : రైతు వేదికలో ఏర్పాటు చేసే వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు రైతు నేస్తం కార్యక్రమంలో నేరుగా రైతులు వీక్షించాలని ఆమె కోరారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయంలోని పలువురు శాస్త్రవేత్తలు రైతుల కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పంటల సాగు, సస్యరక్షణ అంశాలపై సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం
మంగళవారం 19 మార్చి 2024





రౌడీషీటర్లు వివాదాల్లో తలదూర్చొద్దు: ఏసీపీ

మట్టెవాడ, మార్చి 18: రౌడీషీటర్లు వివాదాల్లోకి తలదూరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఏసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు, ఇతర వివాదాల్లోకి వెళితే సహించేది లేదన్నారు. రౌడీషీటర్లపై నిరంతరంగా పోలీసు నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు విఠల్, కుమార్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య ,చిత్రంలో సీపీ అంబర్‌కిశోర్ ఝా

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18: సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి ఇంటెలిజెన్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, గంజాయి, నార్కోటిక్స్ రవాణా జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఏడు అంశాల ప్రాతిపదికన క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో గుర్తించి సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి నగదు, మద్యం పంపిణీ జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ సత్యనారాయణ, నార్కోటిక్స్ ఎస్పీ సైదులు, ఐటీశాఖ నోడల్ అధికారి మహేందర్‌బాబు, ఎక్సైజ్ కమిషనర్ నాగేందర్‌రావు, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీబీసీడీవో పుష్పలత పాల్గొన్నారు.

'బ్యాంక్ లావాదేవీలు సమర్పించాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18: కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో లక్ష రూపాయలకు పైగా బ్యాంక్ లావాదేవీలు జరిపితే వివరాలు సమర్పించాలని జిల్లాఉపఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున బ్యాంకర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎవరైనా బ్యాంక్ ఖాతాలో ప్రతీ రోజు లక్ష రూపాయల నగదు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా, నెలలో రూ.10 లక్షలకు పైబడి నగదు డ్రా, ట్రాన్స్‌ఫర్ చేసినా, అనుమానాస్పద లావాదేవీల వివరాలను ఎన్నికల అధికారులకు అందించాలని కోరారు. ఆన్‌లైన్‌లో జరి గే లావాదేవీలపై గట్టినిఘా పెట్టి, యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే ఇతర యాప్‌ల ద్వారా డబ్బు జమ చేసినా వాటి వివరాలను తెలియపర్చాలని బ్యాంకర్లను ఆదేశిం చారు. సమావేశంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలి రాజు, వివిధ బ్యాంకుల చీఫ్ మేనేజర్లు, ఏజీఎంలు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

శిథిల భవనాలు.. తూట్లుపడ్డ రేకులు..

ప్లాట్‌ఫాంకు ఐదు ఫీట్ల కిందకు రైల్వేపోలీసు స్టేషన్లు

వానొస్తే ముంపులోనే సిబ్బంది విధులు

పట్టించుకోని రైల్వే ఉన్నతాధికారులు



శిథిల భవనంలో జీఆర్‌పీ స్టేషన్

గిర్మాజీపేట, మార్చి 18 : ప్రయాణికులకు రక్షణ కల్పిస్తున్న వరంగల్ రైల్వే పోలీసుస్టేషన్‌లకు సరైన గూడు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపై కాజీపేట వైపు రైల్వే రక్షిత దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) స్టేషన్‌న్నాయి. ఆర్‌పీఎఫ్ రైల్వేశాఖ పరిధిలో, జీఆర్‌పీ రాష్ట్ర ప్రభుత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంటాయి. శిథిల భవనాలు, రేకుల షెడ్డులోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్న భవనాలు, కార్యాలయాలు ప్లాట్‌ఫాంకు దిగువ ఉండడంతో చినుకు పడిందంటే చాలు రైల్వే పోలీసుస్టేషన్ నీట మునుగుతోంది. ఆర్‌పీఎఫ్ ఠాణా ప్లాట్‌ఫాంకు 5 ఫీట్లు దిగువన ఉండటంతో, మెట్లు దిగి వెళ్లాల్సిన దుస్థితి వస్తోంది.



ప్లాట్‌ఫాంకు దిగువన ఉన్న ఆర్‌పీఎఫ్ ఠాణా



పాడైన రేకుల షెడ్డుతో రక్షణలేని రికార్డు రూం

కాజీపేట-శాయంపేట రైల్వేగేటు నుంచి గార్ల వరకు రైల్వే ఆస్తుల పరిరక్షణ,ప్రయాణికుల భద్రత వరంగల్ ఆర్‌పీఎఫ్ పరిధిలో ఉంటుంది. సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఏఎస్సైలు, 21 మంది కానిస్టేబుల్స్ ఉంటారు. రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాల పర్యవేక్షణ కమాండ్ కంట్రోల్ ఆర్‌పీఎఫ్ ఠానాలోనే ఉంటుంది. రైల్వేగేటుల రక్షణ పూర్తిగా ఆర్‌పీఎఫ్ పరిధిలోనే ఉంటుంది. రైల్వే ఆస్తుల పరిరక్షణలకు రైల్వేశాఖకు అనుబంధంగా పనిచేస్తున్న కీలకమైన ఆర్‌పీఎఫ్ ఠానాలకు సరైన భవనం లేకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం..

జీఆర్‌పీ పరిస్థితి ఆర్‌పీఎఫ్ ఠానా కంటే మరింత అధ్వానంగా ఉంది. ఆర్‌పీఎఫ్ ఠానా పక్కనే ప్లాట్‌ఫాంకు ఐదు ఫీట్లు దిగువన సన్నని ఇరుకు దారితో పూర్తిగా శిథిలావస్థ రేకుల షెడ్డులో జీఆర్‌పీ స్టేషన్ ఉంది. రేకులకు రంధ్రాలు పడివాన కాలంలో నీరంతా కారుతోంది. సీఐ, ఇద్దరు ఎస్సైలు, 20 మంది పోలీసు సిబ్బందితో పనిచేస్తున్న వరంగల్ జీఆర్‌పీ పరిధి కాజీపేట దర్గా రైల్వేగేటు నుంచి తాళ్లపూసలపల్లి రైల్వేస్టేషన్ వరకు ఉంటుంది. బాత్‌రూంలు సరిగి లేవు. దీనికితోడు మొదటి ప్లాట్‌ఫాంపై కొత్తగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్‌లు కూడా జీఆర్‌పీ స్టేషన్ వెళ్లె దారి ముందే నిర్మాణాలు చేస్తుండటంతో జీఆర్‌పీ భవనం అదురుతున్నదని జీఆర్‌పీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.18 కోట్లతో అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను తాజాగా అమృత్ పథకం కింద మరో రూ.25కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. అయినా రైల్వే పోలీసుస్టేషన్‌లను అభివృద్ధి చేయాలనే ఆలోచన అధికారులకు రాకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు వరంగల్ రైల్వే పోలీసుస్టేషన్‌ల భవనాల ఎత్తును ప్లాట్‌ఫాం లెవెల్‌కు పెంచి భవనాలను పునఃర్నిర్మించాలని ప్రయాణిక లు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డివిజన్ అధ్యక్షుడు

గీసుగొండ, మార్చి 18: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎలగొండ ప్రవీణ్ తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి కొండా దంపతులు ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రవీణ్ తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. గొర్రెకుంట మాజీ సర్పంచ్ మ్యాదరబోయిన చక్రపాణి, మాజీ ఎంపీటీసీ నమిండ్ల క్రైమెంట్, జన్ను నర్సయ్య, ఇంద మనోజ్, ఏకుల రాజు, లెనిన్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పసునూటి కృష్ణారెడ్డి, రవి పాల్గొన్నారు.



ప్రవీణ్‌కు ఆహ్వానిస్తున్న కొండా, సతీష్‌ను ఆహ్వానిస్తున్న మహేష్‌గౌడ్

34వ డివిజన్ అధ్యక్షుడు..

ఖిలావరంగల్: శివనగర్‌కు చెందిన 34వ డివిజన్ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పగడాల సతీష్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ సమక్షంలో సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా సతీష్ పాల్గొన్నారు. ఆయనతోపాటు అబ్బోజు తిరుపతి, మంద అక్షిత్‌పటేల్, రవిచందర్, శెట్టి అరుణ, మంతెన సంధ్య, గజ్జి విజయ, పాకం సోమలక్ష్మి, తోట శోభారాణి, అనుముల స్వప్న, కొప్పు జయ, టి.ఉమ, నాగరాజు తదితరులు చేరారు. అలాగే 41వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కర్రకుమార్ సైతం హైదరాబాద్‌లో మహేష్ కుమార్‌గౌడ్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

ఎవరికో అభయ'హస్తం'?

5వ పేజీ తరువాయి

ఇన్‌చార్జ్ శనిగపురంఇందిరా, రాగమళ్ల పరమేశ్వర్, జన్ను పరంజ్యోతి, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌తో పాటు మరో నలుగురైదుగురు సీనియర్ కాంగ్రెస్ నేతలు సీరియస్‌గా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధానంగా దళితుల్లో మాల, మాదిగ సామాజిక వర్గాల్లో ఎవరికి సీటు ఇవ్వాలనే దానిపైనే ప్రధానంగా చర్చ జరుగుతుండగా.. పెద్దపల్లి, నాగూర్‌కర్నూలు సీట్లలో మాల సామాజికవర్గం నేతలకే టికెట్ దక్కే అవకాశం ఉండటంతో మాదిగ సామాజిక వర్గం వ్యక్తికి వరంగల్ సీటును కేటాయిస్తారనే చర్చ జరుగుతుంది. ఇక్కడ మాదిగ కులస్థుల ఓట్లే అధికంగా ఉండటంతో ప్రధాన పార్టీలు ఈ సామాజిక వర్గం నేతలకే టికెట్ ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నాయి. కాంగ్రెస్ తొలుత అద్దంకి దయాకర్‌ను పోటీ చేయించాలని భావించినప్పటికి ఈ సామాజిక లెక్కల కారణంగానే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో నాగూర్‌కర్నూలు, పెద్దపల్లి, వరంగల్ సీట్లపై ఒకేసారి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

తేల్చుతారా? నాన్చుతారా?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర పూర్తి కావటంతో మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ సమావేశం నిర్వహిస్తుండగా.. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితర నేతలు ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళుతున్నారు. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ మూడో జాబితాపై కసరత్తు చేయనున్నారు. రాష్ట్రంలో అత్యధిక పోటీ ఉన్న వరంగల్ సీటుపై ఈ సమావేశంలో తేల్చుతారా? ఇంకా నాన్చుతారా? అన్న చర్చ జరుగుతోంది. మరోవైపు బుధవారం ఢిల్లీలోనే కాంగ్రెస్ మిత్రపక్షాలతో సమావేశం కానుండగా.. ఇండియా కూటమిలోని పార్టీలకు టికెట్ల కేటాయింపులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ ఆశిస్తుండటంతో ఈ సమావేశంలో వరంగల్ సీటుపై ఏదో ఒకటి తేలుతుందనే ఆశతో సీపీఐ ఉంది. అయితే ఎన్నికలకు కూడా 55రోజుల సమయం ఉండటంతో ఇప్పుడే వరంగల్ సీటుపై తేల్చుతారా లేక నామినేషన్ల వరకు నాన్చుతారా అనే చర్చ కూడా పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య ఎన్నికల ప్రచారంలోకి దిగారు. అలాగే బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగడం దాదాపు ఖరారనే చర్చ జరుగుతోంది. కానీ దీంతో కాంగ్రెస్‌లో మాత్రం అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దీనికి ఈ రెండ్రోజుల్లో తెరపడుతుందని భావిస్తున్నారు.

విధుల్లో చేరిన వరంగల్ ఎంవీఐలు

ఖిలావరంగల్, మార్చి 18: వరంగల్ జిల్లా రవాణా కార్యాలయంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లుగా (ఎంవీఐ)శోభన్‌బాబు, జైపాల్‌రెడ్డిలు సోమవారం విధుల్లో చేరారు. సిరిసిల్లరాజన్న జిల్లా నుంచి శోభన్‌బాబు, భద్రాద్రి కొత్తగూడెం నుంచి జైపాల్‌రెడ్డిలు జిల్లాకు వచ్చారు. గతంలో ఇక్కడ ఎంవీఐగా పని చేసిన శ్రీనివాస్ ఆదిలాబాద్‌లో ఎంవీఐగా చేరారు. సోమవారం వరంగల్ ఆర్టీవో గంధం లక్ష్మి ఆధ్వర్యంలో వారు బాధ్యతలు స్వీకరించారు.

కొమ్మాల జాతర కమిటీ ఎన్నిక

గీసుగొండ, మార్చి 18: కొమ్మాల శ్రీలక్ష్మినరసింహస్వామి జాతర ఉత్సవ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు చాడా కొమురారెడ్డి సోమవారం తెలిపారు. కమిటీలో కాందూరి రామాచారి, లావుడ్యా రాజు, కోల వేణు, మూడు వీరేందర్, బత్తిని భాస్కర్, భూక్యా రాంబాబు, వాంకుడోతు సేవ్లా, లడే రాజేశ్వర్‌రావు, కందికొండ రాజ్‌కుమార్, మండల నరేష్, ఇమ్మడి సాంబయ్య, తాటికాయల స్వరూప, యార రాజిరెడ్డి, కౌడగాని శ్రీనాథ్ ఉన్నారు.

సౌందర్యలహరి స్తోత్ర పారాయణం



వరంగల్ కల్చరల్, మార్చి 18: ఓరుగల్లు సౌందర్యలహరి భక్త మండలి బృందం శోభారాణి, అన్నపూర్ణల ఆధ్వర్యంలో సోమవారం కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో సౌందర్యలహరి స్తోత్ర పారాయణం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పారాయణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు బయ్యస్వామి, ఓరుగంటి కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'చల్లా' పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

సంగెం, మార్చి 18 : మండలంలోని నర్సా నగర్‌లో ఇటీవల బీఆర్‌ఎస్ నాయకుడు ఉండీల వేణు అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం మృతుడి కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సర్పంచులు చత్రు నాయక్, బాబు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన ఉషశ్రీ



సంగెం, మార్చి 18 : గుంటూరుపల్లికి చెందిన పాటి ఉషశ్రీ ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. జూనియర్ లెక్చరర్, గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైనెడ్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగాలను సొంతం చేసుకుంది. సూర్యాపేట జిల్లా కాపుగల్లు ప్రభుత్వ పాఠశాలలో టెన్త్, కవిత జూనియర్ కళాశాలలో ఇంటర్, శ్రీసాయి వికాస్ డిగ్రీ చేసింది. దేవరపల్లిలోని డీహెచ్‌ఎస్‌ఆర్‌లో పీజీ చదివి ఖమ్మంలోని సెంట్ అన్స్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీఈడీ పూర్తిచేసింది. ఇద్దరు పిల్లలను చూసుకుంటూనే భర్త హరీష్, సహకారంతో ఉద్యోగాలు సాధించింది.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ఇన్‌సెట్లో ప్రసంగిస్తున్న సీఎస్

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించండి: సీఎస్ కిశోర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18: రాష్ట్రంలో నీటి ఎద్దడి నివారణకు సమగ్ర ప్రణాళికతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరి దాన కిశోర్ సూచించారు. సోమవారం వేసవి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హైదరాబాద్ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బల్దియా కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వేసవి ముగిసే వరకు ప్రతీ గడపకు నీరందించాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 66 డివిజన్‌ల పరిధిలో నీటి వినియోగంపై అనుసరిస్తున్న విధానంపై వరంగల్ కమిషనర్ అశ్విని వెల్లడించారు. ప్రతీ రోజు ప్రజల అవసరాల కోసం 180 ఎంఎల్‌డీల నీరు అవసరం ఉందని, ధర్మసాగర్ రిజర్వాయర్ ప్రధాన వనరుగా ఉందని చెప్పారు. బల్దియా పరిధిలో 20 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం జరిగిందని వేసవిలో 47 వాటర్ ట్యాంకుల ద్వారా నీరు అందించడం జరుగుతుందన్నారు. వార్షిక ప్రణాళికలో భాగంగా రూ.86లక్షలతో లీకేజీలను అరికట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, ఈఈలు రాజయ్య, శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సారంగం, రవికిరణ్, రంగారావు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 : గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రజలకు నీరు అందుబాటులో ఉండాలని, నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌లను సందర్శించి నీటి సరఫరాపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఇంటెక్‌వెల్ నుంచి మూడు ఫిల్టర్ బెడ్‌లకు వెళ్తే నీటిని పరిశీలించారు. ల్యాబ్‌లో నీటి నాణ్యత నిర్ధారణ విధానం, క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి గత ఐదు సంవత్సరాలుగా నీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సహకారం అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు హామీ ఇచ్చారు. అనంతరం వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీటి శుద్ధీకరణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఫ్లో మీటరు పని తీరును అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, డీఈలు సంతోష్ శ్రీకాంత్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఏఈ మహేశ్‌లు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వరంగల్ చౌరస్తా, మార్చి 18: మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన సంతోషిమాత కాలనీకి చెందిన పోలీసు గన్‌మెన్ విలాసాగరం రాజు కుటుంబాన్ని, రామన్నపేటలోని శెట్టి రవి కుటుంబాన్ని సోమవారం మాజీ చీఫ్ విప్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శించారు. గుండెపోటుతో మరణించడం విషాదకరమని వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. వినయ్ భాస్కర్ వెంట రాచర్ల జగన్, గట్టు చందు, మేడకట్ల సుకుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సత్యవాణి

పోచమ్మమైదాన్,మార్చి18: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని డిస్ట్రిక్ యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ సత్యవాణి కోరారు. ఫైడిపెల్లిలో సోమవారం జైజవాన్- జైకిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ బాలుర చాంపియన్‌షిప్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో ఈనెల 23 నుంచి 27 వరకు జరిగే 45వ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పవన్ కుమార్, ఇట్యాల శ్రీనివాస్, జన్ను కుమార్, మేకల ధర్మేందర్, జన్ను స్వామి పాల్గొన్నారు.

బీజేపీ జోనల్ ఇన్‌చార్జుల నియామకం

గీసుగొండ, మార్చి 18: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా డివిజన్ ఇన్‌చార్జులను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12, 13, 22 డివిజన్‌లకు గోకె వెంకటేష్, 23, 24, 25డివిజన్‌లకు కనుకుంట్ల రంజిత్, 18, 19, 27 డివిజన్‌లకు తాబేటి వెంకటేశ్వర్లుగౌడ్, 20, 21, 26 డివిజన్‌లకు రఘునారెడ్డి, 28, 32, 39 డివిజన్‌లకు సుమన్‌శత్రి, 33, 34, 35 డివిజన్‌లకు మందా శ్రీనివాస్, 36, 37, 38 డివిజన్‌లకు కందిమల మహేష్, 40, 41, 42 డివిజన్‌లకు గడల కుమార్‌లను జోనల్ ఇన్‌చార్జులుగా నియమించారు.



కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- పట్టణ అధ్యక్షుడి నియామకంపై అభ్యంతరం
- ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయం పట్ల ఆగ్రహం



మాట్లాడుతున్న జిల్లా నాయకుడు మహ్మద్ అప్సర్, తదితరులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 18 : వర్ధన్నపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నూతన పట్టణ అధ్యక్షుడిని నియమించడాన్ని పలువురు పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభ్యంతరం తెలిపారు. పట్టణ నాయకులను, కార్యకర్తలను సంప్రదించకుండా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మహ్మద్ అప్సర్, కౌన్సిలర్ సమ్మెట సుధీర్, మాజీ పట్టణ అధ్యక్షుడు చిదురాల కుమారస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వారిని గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉండి పనిచేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇటీవల ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి పార్టీ పోస్టులు ఇచ్చి సీనియర్ నాయకులకు చెప్పకుండా చేయడం అవమానించడమేనని అన్నారు. పట్టణంలో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా, పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న చిదురాల కుమారస్వామిని సంప్రదించకుండా నూతన అధ్యక్షుడిని నియమించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కొంత మంది నాయకులు తప్పుదారిపట్టిస్తున్నారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడు వెల్లబోసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శివరాత్రి వెంకటనర్సు, కొండేటి బాలకృష్ణ, ఐత సుధాకర్, ఎర్ర ప్రేమ్ రాజ్, ఎండీ షబ్బీర్, సమ్మెట రాంబాబు, బంగారు సదానందం, ఎల్లస్వామి, చందు మల్లయ్య జగన్, జన్ను నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ఎంపీవోపై దాడికి నిరసన

ఖానాపురం, మార్చి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీవోపై దాడిని నిరసిస్తూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిరసన వ్యక్తంచేశారు. ఎంపీడీవో భారతితో పాటు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

మిర్చి పంటకు తెగులు

- దెబ్బతిన్న తోటలు.. తగ్గిన దిగుబడి
- పెరిగిన ఖర్చులు.. రైతు కంట కన్నీరు
- పెట్టుబడి చేతికందే పరిస్థితి లేక దిగాలు



బాంజీపేట శివారులో వైరస్ తెగులుతో దెబ్బతిన్న మిర్చిపంట

నర్సంపేట, మార్చి 18: లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి అరగాలం కష్టించి సాగు చేసిన మిర్చి పంటను సాగు చేసిన రైతులకు లాభాలకు బదులు నష్టాలు, కన్నీళ్లే మిగిలాయి. మిర్చి పంట ఏపుగా పెరిగి కాతదశకు చేరుకోవడంతో దిగుబడులు పెరిగి ఆదాయం సమకూరుతుందని ఆశించిన రైతుల ఆశలపై తెగుళ్ళు నీళ్ళుచల్లాయి. మిర్చిపంటకు వైరస్ తెగులు వ్యాపించడంతో పంట దెబ్బతిని దిగుబడులు భారీగా తగ్గిపోయి పెట్టిన పెట్టుబడులు చేతికందే పరిస్థితులు కానరావడంలేదని రైతులు కంట కన్నీరు కారుస్తున్నారు. గత రెండేళ్ళు అధిక వర్షాల వల్ల మిర్చిపంట దెబ్బతిని నష్టపోయిన రైతులు ఈ ఏడాది దిగుబడులు పెరిగి ఆధాయం పెరిగి నష్టాల నుంచి గట్టెక్కు తామని ఆశించిన రైతులకు అప్పులతో తిప్పలు తప్పడం లేదు. జిల్లాలోనే నర్సంపేట నియోజకవర్గంలో దొడ్డురకం మిర్చి. తేజ రకం మిర్చి అత్యధికంగా సాగవుతుంది. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట, గీసుగొండ, ఖిలా వరంగల్, పర్వతగిరి, రాయపర్తి, సంగెం, వరంగల్, వర్ధన్నపేట మండలాల్లో అధికారుల లెక్కల ప్రకారం 10వేల 525 మంది రైతులు 12వేల 752 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ఇందులో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 12వేల 176 ఎకరాల్లో 9వేల966మంది రైతులు మిర్చిని సాగుచేశారు. ఈ ఏడాది మిర్చి పంట ఏపుగా పెరిగి కాత, కోత దశకు చేరుకున్న సమయంలో వైరస్ తెగులుతో పాటు పలు రకాల తెగుళ్ళపంటను చుట్టుముట్టాయి, వైరస్, తెగుళ్ళ నివారణకు వివిధ రకాల మందులను పిచికారి చేసినా తెగుళ్ళ అదుపులోకి రాకపోగా పిచికారి మందుల ఖర్చు పెరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.80 వేల నుంచి లక్ష వరకు పెట్టుబడి పెట్టామని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ళ దిగుబడి రావాల్సి ఉండగా 4 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేదని రైతులు దిగులు చెందుతున్నారు. చాలా మంది రైతులు ఏరిన మిర్చిని కళ్ళాల్లో ఆరబోసుకోగా కొంత మంది రైతుల తోటలు కోతదశలో ఉన్నారు. వచ్చినకొద్దిపాటి దిగుబడిలో రంగుమారిన, తాలు మిర్చి కొంతమేరకు రావడంతో నష్టాలు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది దొడ్డురకం మిర్చికి క్వింటాల్‌కు రూ.80వేల నుంచి రూ.90వేల ధర పలుకగా, ఈ ఏడాది రూ:30 నుంచి రూ.40వేల ధర పలుకు తుందని, తేజ రకం మిర్చికి రూ.16వేల నుంచి రూ.21 వేల ధర లభిస్తుందని ఈ ధరలతో రైతులకు చేకూరే ప్రయోజనం ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

వైరస్‌తెగులు, ఇతర తెగుళ్ళతో మిర్చిపంట దెబ్బతిని నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత రెండేళ్ల అధికవర్షాలతో మిర్చి పంట దెబ్బతిని నష్టపోయిన తాము మిర్చిపంటపై తెగుళ్ళు చుట్టుముట్టడంతో పంటపపూర్తిగా దెబ్బతిని పెట్టుబడి చేతికి అందే పరిస్థితి లేక అప్పుల ఊబిలో కూరుకు పోయామని ప్రభుత్వం అధికారులతో సర్వేలు జరిపించి పంట నష్టపోయిన తమకు పరిహారం అందించి ఆదుకోవాలనిరైతులు కోరుతున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



నర్సంపేటలోని బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నర్సంపేట, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నర్సంపేట పట్టణంలో 5 పరీక్షా కేం ద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష సమయం కంటే గంట ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షా సమయం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్ణయించారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 200మంది విద్యార్థులకు గాను 200మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు. జడ్‌పిఎస్ఎస్ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 113 మందికి 113 మంది హాజరయ్యారు. గీతాంజలి హై స్కూల్ పరీక్షా కేంద్రంలో 240 మందికి గాను 240 మంది హాజరు కాగా, విజ్‌డమ్‌పాఠశాల పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులకు గాను 239 మంది విద్యార్థులు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో 199 మంది విద్యార్థులకు గాను 119 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షా కేం ద్రాల పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. తొలిరోజు పదవతరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

- చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదోవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రెండు సెంటర్లల్లో 369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపింగ్‌కు పాల్పడకుండా విద్యార్థులను పరిశీలించి పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. మోడల్ పాఠశాలలో పేపర్ ఇవ్వక ముందే సారయ్య ఆధర్వంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంట్ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.
- ఖానాపురం: పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఖానాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 109మందికి 109మంది, బుధరావుపేట మోడల్ స్కూల్‌లో 160మందికి గాను 160 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.
- దుగ్గొండి : మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో 150 మంది, మల్లంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత నిర్వహణకు స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్ పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు. సెంటర్లను సందర్శించి తనిఖీచేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుటకు సీఎస్‌లు రామస్వామి, భద్రమ్మలు తగు చర్యలు తీసుకున్నారు.
- నెక్కొండ : మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ మోడల్ స్కూల్‌లో 200 మంది విద్యార్థులకు గాను 197, ఫాదర్‌కోలోబోస్ పాఠశాలలో 196మందికి గాను 195, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 94 మందికి 94 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.
- వర్ధన్నపేట రూరల్ : పదో తరగతి పరీక్షలు పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంచారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, లోపలికి పంపించారు. మండలంలో 450 మంది విద్యార్థులకు నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- పర్వతగిరి : పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్, సోషల్ వెల్ఫేర్, మోడల్‌స్కూల్‌లో పరీక్షల కేంద్రాలు ఏర్పాటుచేయగా, జిల్లా పరిషత్‌లో 146 మంది, సోషల్ వెల్ఫేర్‌లో 150 మందికి గాను పూర్తిగా హాజరు కాగా, మోడల్ స్కూల్‌లో 180 మందికి గాను 179 మంది హాజరైనట్లు కస్టోడియన్ రమేష్ బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.
- రాయపర్తి : మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు కేంద్రాల్లో 450 మంది విద్యార్థులకు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాలను రాయపర్తి ఎస్ఐ సందీప్ కుమార్ తనిఖీ చేశారు.

గ్రామాల్లో ప్రారంభమైన జాజిరి ఆటలు



జాజిరి ఆడుతున్న చిన్నారులు

దుగ్గొండి, మార్చి 18 : గ్రామాల్లో జాజిరి ఆటలు ఘనంగా ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. హోలీ పండుగకు తొమ్మిది రోజుల ముందు బాలురు జాజిరి, బాలికలు కోలాటాలు (కావుడ) ఆడడం ఆనవాయితీగా వస్తోంది. తొమ్మిదివ రోజు గ్రామాలలోని ప్రధాన కూడళ్ల వద్ద జాజిరి కర్రలను మంటల్లో కాలుస్తారు. తొమ్మిది రోజుల పాటు రాత్రి వేళల్లో ఇంటింటికి తిరుగుతూ పాటలు పాడుతూ డబ్బులు, ధాన్యం తదితర వస్తువులు వసూళ్ల చేయడంచేస్తారు. చివరి రోజు పెద్దవారు సైతం ఆటలు ఆడుతుంటారు. జాజిరి, కోలాటాలతో వచ్చిన డబ్బులను సమీప మండలమైన గీసుగొండ మండలంలోని కొమ్మాల గ్రామంలో జరిగే లక్ష్మీనర్సింహ స్వామి జాతరకు వెళ్లి వస్తువులు కొనుగోలుకు ఖర్చు చేసుకోవడం జరుగుతుంది.. జాజిరి ఆటలలో సంతోషంగా చిన్నారులు పాల్గొంటున్నారు.

సంక్షేమ పథకాలను అందిస్తున్న మోదీ సర్కార్



ఇల్లందలో మాట్లాడుతున్న రాయపురపు కుమారస్వామి

నర్సంపేట, మార్చి 18 : పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను మోదీ సర్కార్ అందిస్తున్నదని బీజేపీ నియోజకవర్గ చేరికల కమిటీ ఛైర్మెన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ జుర్రు రాజు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన బుర్ర చందర్‌రావు, జి.కుమార్, గాదెగోని శ్రీనివాస్, పైసా ప్రశాంత్, సలేంద్రరాజు, జుర్రు పెద్దరాజు, రాజేశ్, ఆకుల చందు, కల్యాణ్, గాదెగోని రాజు, ముసుగు కుమార్, జజుర్రు కుమార్, వెంకన్న, వీరన్న, చేరాలు, సారయ్య, సాంబయ్యతో సహా నలభై కుటుంబాలు బీజేపీలో చేరగా వారికి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ కాషాయం కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కొంతమంది రాజకీయ నాయకులు వారి ప్రాబల్యం తగ్గిపోవడంతో బీజేపీపై, ప్రధాని నరేంద్ర మోదీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రామచంద్రరెడ్డి, గుడిపూడి రాధాకృష్ణ, శ్రీరంగం సాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇరత పార్టీల నాయకులను ఆహ్వానించండి

వర్ధన్నపేట రూరల్ : బీజేపీని విస్తృతస్థాయిలో బలోపేతం చేసేందుకు గ్రామాల్లో ఉన్న ఇతర పార్టీల నాయకులను ఆహ్వానించాలని మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మరింత బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసేందుకు, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ఇతర పార్టీల వారిని స్వాగతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపెల్లి యాకయ్య తాళ్లపెల్లి కృష్ణమూర్తి, డోలి సతీష్, నర్సింగరావు, వెంకటస్వామి, నాంపెల్లి యాకస్వామి, పోశాల సురేష్, చెంగల సురేష్ సోమిరెడ్డి, లక్‌పతి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి



రవి (ఫైల్)

ఖానాపురం, మార్చి 18 : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కడారి రవి(40) నీటి సంపులో పడి సోమవారం మృతి చెందాడు. ఎస్సై రఘుపతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హమాలి కార్మికుడు రవి తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో తమ బంధువు చనిపోగా సోమవారం మూడోరోజు కార్యక్రమానికి వెళ్లాడు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రవి, ఇంటి ఆవరణలోని సంపులో నీటిని తోడుతూ అందులో పడిపోయాడు. అనంతరం ఇంటికి చేరుకున్న రవి తల్లి కొంరమ్మ సంపులో పడి ఉన్న కుమారుడిని గమనించి కేకలు వేయగా, ఇరుగు పొరుగు వారు వచ్చి సంపులో నుంచి రవిని బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య రమ కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులకు వెళ్తుంది. మద్యానికి బానిసైన రవి భార్య వద్దకు వెళ్లకుండా కొత్తూరులోనే ఉంటున్నాడు. మృతునికి భార్య కుమార్తె ఉన్నారు. మృతుని తల్లి కొంరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

చెన్నారావుపేట, మార్చి 18 : మండలంలోని చెరువుకొమ్ముతండా శివారు కోర్రతండాకు చెందిన ఓ వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందనట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఇదే తండాకు చెందిన భూక్య ఝాన్సీ(22)ని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం తిరుమలగండికి చెందిన ఓ యువకునికి ఇచ్చి వివాహం చేశారు. గత కొద్ది కాలంగా ఝాన్సీ కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఈ నెల 11న పుట్టింటికి వచ్చిన ఝాన్సీకి కడుపు నొప్పి తీవ్రత ఎక్కువగా కావటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పండింది. దీంతో చుట్టు పక్కల వారు గమనించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, మృతురాలి తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నూతన అంశాలపై దృష్టి సారించాలి

చెన్నారావుపేట, మార్చి 18 : విద్యార్థులు నూతన విషయాలపై దృష్టి సారించాలని సిద్ధార్థ విద్యా సంస్థల ఛైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హై స్కూల్‌లో చిన్నారులకు పాఠశాల స్థాయి సైన్స్ ఫేయిర్‌ను నిర్వహించాలి. సైన్స్ ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, జక్కుల జగదీశ్వర్, కృష్ణమోహన్, వేణు, గణేష్, విష్ణు, నామాల సృజన తదితరులు పాల్గొన్నారు.

తొలగిన ఫ్లెక్సీలు.. మలిగిన రాతలు

నెక్కొండ, మార్చి 18 : లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నెక్కొండ మండలంలోని పలు గ్రామాల్లో గోడలపై రాసిన రాజకీయ ప్రచార రాతలను సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. దీంతోపాటు రాజకీయ నాయకుల ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. పార్లమెంట్ ఎన్నికల పుణ్యమా తమ ఇంటి గోడలు శుభ్రమవుతున్నాయంటూ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు

నర్సంపేట టౌన్, మార్చి 18 : పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సీపీఆర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు స్నేహ సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకొని ఆపదలో ఉన్న వారిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రామారావు బాధ్యతల స్వీకరణ



నల్లబెల్లి, మార్చి 18 : నల్లబెల్లి నూతన ఎస్సైగా రామారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్సై రామారావును ఎంపీ ఎన్నికల దృష్ట్యా నల్లబెల్లికి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నల్లబెల్లి నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన రామారావుకు సిబ్బంది శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా విధులను నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గత ఎంపీలు చేసిన అభివృద్ధి శూన్యం

ప్రజలకు సేవచేసేందుకే మహబూబాబాద్ ఎంపిగా పోటీ చేస్తున్నా

స్వతంత్ర అభ్యర్థి అనిల్‌నాయక్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ నాయక్

నర్సంపేట, మార్చి 18 : ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో త్వరలో జరుగును న్న మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని నర్సంపేటలోని వేములతండాకు చెందిన బోడ అనిల్‌నాయక్ అన్నారు. పట్టణంలో సోమవారం విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో గెలిచిన ఎంపిలు ప్రజల సమస్యలపై ఏనాడు పార్లమెంట్‌లో గళం విప్పలేదన్నారు. గతంలో వివిధ పార్టీల నుంచి గెలిచిన ఎంపిలు చేసిన అబివృద్ధి శూన్యమని ఆయన అన్నారు. బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చే యించి నిరుద్యోగులకు ఉపాధిఅవకాశాలు కల్పించలేక పోయారని ఆయన అన్నారు. పార్టీలపై తన పోరాటం కాదని అభ్యర్థులపై పోరాటం చేస్తానని ఆయన అన్నారు. గిరిజనన ప్రజల సమస్యల పరిష్కారానికి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంపిలు కృషి చేయలేదన్నారు. ప్రజాసమస్యలను పక్కదారి పట్టించారే తప్ప వారు చేసిన అబివృద్ధి ఏమీ లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్య క్రమంలో పార్లమెంటరీ కోఆర్డినేటర్ లవన్‌నాయక్, మహబూబాబాద్ కోఆర్డినేటర్ రవినాయక్, మాలోతు గణేశ్, అజ్మీరాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి..



రోడ్డులేక మృతదేహాన్ని నీటిలో నుంచి తీసుకెళుతున్న గ్రామస్థులు

చెన్నారావుపేట, మార్చి 18 : మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామంలో రోడ్డు సౌకర్యం లేక మృత దేహాలను తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గ్రామ శివారులో ఉన్న ఈ రోడ్డు ఓ తండాకు వెళ్లుతుంది, ఆదేవిధంగా గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి చెలుకల వద్ద ఖననం చేయడానికి ఇదే దారి గుండావెళ్లాలి. గత 30ఏళ్లుగా ఈ రోడ్డుపైన పంట పొలాలకు వెళ్లే కాలువ ఉంది. ఈ కాలువకు ఎలాంటి మోరీల నిర్మాణం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టక పోవటంతో ప్రతీ రోజు సాగు నీరు రోడ్డుపై నిలిచి ఉంటుంది. దీంతో ఆ రోడ్డుకు వెళ్లాలంటే బురద నీటిలో నుంచి నడవాల్సిందేనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరువ తీసుకొని రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్థులు, తండా వాసులు కోరుతున్నారు.


ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌కు సన్మానం



ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతంను సన్మానిస్తున్న వెంకటయ్య

వర్ధన్నపేట రూరల్, మార్చి 18 : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియామకమైన నగరగారి ప్రీతంను సోమవారం వరంగల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఛైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గబ్బెట బాబు, మండల అధికార ప్రతినిధి కందిక వీరస్వామి, కొండేటి మధుకర్ పాల్గొన్నారు.

'కుడా' ఛైర్మన్‌ను కలిసిన నాయకులు



కుడా ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

పర్వతగిరి, మార్చి 18 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రాం రెడ్డిని సోమవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇనుగాలను కలిసినవారిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఎవరికో అభయ'హస్తం'?

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ శనిగపురం ఇందిరా, రాగమళ్ల పరమేశ్వర్, జన్ను పరంజ్యోతి, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌తో పాటు మరో నలుగురైదుగురు సీనియర్ కాంగ్రెస్ నేతలు సీరియస్‌గా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధానంగా దళితుల్లో మాల, మాదిగ సామాజిక వర్గాల్లో ఎవరికి సీటు ఇవ్వాలనే దానిపైనే ప్రధానంగా చర్చ జరుగుతుండగా.. పెద్దపల్లి, నాగూర్‌కర్నూలు సీట్లలో మాల సామాజిక వర్గం నేతలకే టికెట్ దక్కే అవకాశం ఉండటంతో మాదిగ సామాజిక వర్గం వ్యక్తికి వరంగల్ సీటును కేటాయిస్తారనే చర్చ జరుగుతుంది. ఇక్కడ మాదిగ కులస్థుల ఓట్లే అధికంగా ఉండటంతో ప్రధాన పార్టీలు ఈ సామాజిక వర్గం నేతలకే టికెట్ ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నాయి. కాంగ్రెస్ తొలుత అద్దంకి దయాకర్‌ను పోటీ చేయించాలని భావించినప్పటికి ఈ సామాజిక లెక్కల కారణంగానే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో నాగూర్‌కర్నూలు, పెద్దపల్లి, వరంగల్ సీట్లపై ఒకేసారి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

తేల్చుతారా? నాన్చుతారా?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర పూర్తి కావటంతో మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ సమావేశం నిర్వహిస్తుండగా.. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితర నేతలు ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళుతున్నారు. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ మూడో జాబితాపై కసరత్తు చేయనున్నారు. రాష్ట్రంలో అత్యధిక పోటీ ఉన్న వరంగల్ సీటుపై ఈ సమావేశంలో తేల్చుతారా? ఇంకా నాన్చుతారా? అన్న చర్చ జరుగుతోంది. మరోవైపు బుధవారం ఢిల్లీలోనే కాంగ్రెస్ మిత్రపక్షాలతో సమావేశం కానుండగా.. ఇండియా కూటమిలోని పార్టీలకు టికెట్ల కేటాయింపులు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ ఆశిస్తుండటంతో ఈ సమావేశంలో వరంగల్ సీటుపై ఏదో ఒకటి తేలుతుందనే ఆశతో సీపీఐ ఉంది. అయితే ఎన్నికలకు కూడా 55రోజుల సమయం ఉండటంతో ఇప్పుడే వరంగల్ సీటుపై తేల్చుతారా లేక నామినేషన్ల వరకు నాన్చుతారా అనే చర్చ కూడా పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య ఎన్నికల ప్రచారంలోకి దిగారు. అలాగే బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగడం దాదాపు ఖరారనే చర్చ జరుగుతోంది. కానీ దీంతో కాంగ్రెస్‌లో మాత్రం అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. దీనికి ఈ రెండ్రోజుల్లో తెరపడుతుందని భావిస్తున్నారు.